

# నేను - నా జ్ఞాపకాలు

- జీడిగుంట రామచంద్రమూర్తి



*రచనా కాలం: 2019*

(గత సంచిక తరువాయి)

## నాకు జ్ఞాపకం లేని "ఆ అరవై రోజులు"

2012 ఆగస్టు 31 వ తేదీ రాత్రి ఏడు గంటలవుతూండగా నేను ఒక సమావేశంలో పాల్గొనటానికి ప్రెస్ క్లబ్బుకి వెళ్ళాను. ఇంకా సమావేశం ప్రారంభం కాలేదు హఠాత్తుగా నా మెడ రెండు వైపులా నొప్పి ప్రారంభమైంది. కొద్ది నిమిషాలకే ఆ నొప్పి రెండు కణతలకు ప్రాకింది. నాకు'స్పాండిలైటిస్'వున్న కారణంగా ఆ నొప్పి వచ్చివుంటుదనుకున్నాను. క్షణాల్లో నొప్పి విపరీతమై కళ్లు తిరిగాయి. సమావేశం నించి ఇంటికి వెళ్లిపోతే మంచిదనుకున్నాను. కుర్చీలోంచి లేవబోయాను.

నాకేమీ కనిపించలేదు. స్పృహ కోల్పోతున్నట్లు అనిపించింది. అంతే అలా కుర్చీలోనే కూలిపోయాను తర్వాత ఏం జరిగిందో నాకు తెలీదు. తిరిగి సెప్టెంబరు 20 వ తేదీన నా కుటుంబ సభ్యులతో కేర్ ఆస్పత్రినించి ఇంటికి చేరటం మాత్రమే జ్ఞాపకం వుంది. ఆ మధ్యలో ఇరవై రోజులూ ఏం జరిగిందో నాకు జ్ఞాపకంలేదు.

నా భార్యా, నా పిల్లలూ ఆ ఇరవై రోజులూ ఏం జరిగిందో రాస్తామంటే రాయమన్నాను. వాళ్లు రాసిన ఆ ఇరవై రోజుల వాళ్ల జ్ఞాపకాల్నీ యధాతధంగా మీకు తెలియపరుస్తున్నాను. చదవండి ...

అందరం మా అపార్ట్మెంట్ లోకి రాగానే నాన్న తిన్నగా వేగంగా నడుచుకుంటూ తన బెడ్ రూంలోకి వెళ్లారు. మళ్లీ వెంటనే హాల్లోకి వచ్చి ఆయన రోజూ కూర్చునే కుర్చీలోనే కూర్చున్నారు. మా' సపోర్టు 'తీసుకోకుండానే నడవటం, కూర్చోవటం, పడుకోవటం వంటివి చూస్తుంటే మా ఆనందానికి అవధులు లేకుండా పోయాయి!

ఆరోజు గడిచిపోయింది. 22 వ తేదీ నుంచి, నాన్నని చూసేందుకు బంధుమిత్రులు మా ఇంటికి రావటం మొదలెట్టారు. అయితే డాక్టరుగారు ప్రిస్క్రయిబ్ చేసిన మందులు వేయటానికి మేం ఇబ్బంది పడాల్సి వచ్చింది.

మూడుపూటలా ఎన్నెన్నో మాత్రలు వేసుకోవాల్సిన పరిస్థితి! ఒకోసారి మందులు వేసుకోమంటే నాన్న వద్దనేవారు. చిన్నపిల్లాడిలా

మొరాయించేవారు. ఒకసారి మా పూజ మాత్రలు ఇస్తే వాటిని విసిరేసి-" వేసుకోకపోతే ఏమీ కాదులే! మహా అయితే పోతాను .. అంతేగా! "అన్నారు నాన్న. పూజ ఏడ్చేసింది.

మొత్తానికి ఆయన్ని ఒప్పించి కిందపడిపోయిన మాత్రలు తీసి ఇచ్చాం!

అలా రోజులు గడుస్తున్నాయి. అయితే నాన్న మాత్రం వేటిమీదా ఆసక్తి చూపించటం లేదు. 'మందులు వేసుకోను' అనటం .. 'అన్నం తినను' అనటం. రోజు ఇదే తంతైపోయింది. మంచం మీదనే పడుకుని వుండటం .. హాలులోకి కూడా రాకపోవటం, కూర్చోకపోవటం.. ఇలాగే గడుస్తున్నాయి రోజులు!

ఒకనాడు అమ్మ చెప్పింది నాతో- "నాన్న సూసైడ్ చేసుకుంటానంటున్నార్రా' అని .. మేమంతా షాక్! ఆరోజు రాత్రి అమ్మతో అన్నారట! 'మనిద్దరం కలిసి చచ్చిపోదాం పిల్లలందరూ బావున్నారు. సెటిల్ అయిపోయారు. నాకు ఏమీ చేయాలని అనిపించటం లేదు. నిద్ర రావటం లేదు. తిండి సహించటం లేదు. అనవసరంగా పిల్లల్ని కష్టపెడుతున్నాం. బతకటం అనవసరం" అని! అమ్మ మాతో చెప్పి చాలా బాధపడింది.

ఓరోజు నాన్న మిత్రులు శ్రీసుబ్బరాయశర్మ నాన్నని చూసేందుకు వచ్చారు. ఆయనతో కూడా అమ్మకు చెప్పిందే చెప్తుంటే నేను విన్నాను. నాన్న డిప్రెషన్ లోకి వెడుతున్నారేమో అని భయం వేసింది.

డా ॥ శివారెడ్డిగారి అపాయింట్ మెంట్ తీసుకుని మర్నాడు కేర్ ఆస్పత్రికి తీసుకువెళ్లాం. ఆయన చిరునవ్వుతో" ఏమండీ మూర్తిగారూ! జీన్స్ ప్యాంట్ వేసుకుని బావున్నారే .. చాలా స్మార్ట్ గా వున్నారు "అంటూ నాన్నని పలకరించారు.

అప్పుడు నాన్న అమ్మతో చెప్పిన ఆత్మహత్య విషయం అంతా డాక్టరుగారికి చెప్పారు.

"నేను బ్రతికుండి ప్రయోజనం ఏమీలేదు సార్! నేను ఏమీ చేయలేకపోతున్నాను. ఏదైనా' మెర్సీ కిల్లింగ్'కి మందు వుంటే ఇవ్వండి .. చచ్చిపోతాను "అన్నారు నాన్న.

డా. శివారెడ్డిగారి పక్కనే డా. రవివర్మగారు కూడా వున్నారు. ఇద్దరూ ఒకరినొకరు చూసుకుని-రెండు క్షణాల తర్వాత శివారెడ్డిగారు అన్నారు-" చూడండి మూర్తిగారూ! ఇలాంటి ఆపరేషన్ చేయించుకున్న వందమందిలో ఎనభైమందికి మీకొచ్చిన ఆలోచనే వస్తుంది. అనవసరంగా అలాంటి ఆలోచనలు పెట్టుకోకండి! మీ పిల్లలంతా 'సెటిల్ అయ్యారనీ, మీరు మీ పిల్లల్నీ మనవల్నీ కష్టపెడుతున్నారనీ, వాళ్లు బాధపడుతున్నారనీ ఇలా ఇన్ని విషయాలు

ఆలోచిస్తున్నారంటే మీ బ్రెయిన్ చాలా షార్ప్ గా, అద్భుతంగా పనిచేస్తోంది. మీరు వారం, పదిరోజుల్లో మామూలు మనిషైపోతారు. మీరు ఇంకా ఎన్నో కథలు రాస్తారు" అంటూ కౌన్సిలింగ్ ఇచ్చి నాన్నకి ధైర్యం చెప్పారు. అక్కడితో ఆయన

చెప్పటం ఆపలేదు.

"మీరింక హాస్పిటల్ కి రావక్కర్లేదు .. మీరు కథ రాశాక, మామూలుగా అయ్యాక,

అప్పుడు రండి! అంతేకానీ ఆరోగ్యం బాగా లేదనుకుని రాకండి" అని నవ్వుతూనే చెప్పారు.

డా ॥ శివారెడ్డిగారు చెప్పిన ఆ మాటలు, మరి మంత్రాల్లాగా పనిచేశాయో ఏమిటో నాన్న మళ్లీ డిప్రెషన్ లోకి వెళ్లలేదు. ఆరోగ్యం గురించి మళ్లీ ఆయన్ని కలువలేదు. ఆర్నెల్లకోసారీ, ఏడాదికోసారీ ఆయన్ని చూడాలనిపించీ, ఆయన చిరునవ్వును చూడాలనిపించి వెళ్లి కలుస్తుంటారు.

'ఓం నమశ్శివాయ' అంటూ ఆ పరమశివుణ్ణి తలచుకోవటం అలవాటు చేసుకున్నారు. మేము నాన్నను వెన్నంటి కాపలా కాయటంకోసం పెట్టుకున్న అటెండెంట్ శ్రీనివాస్ ను, నెలరోజుల తరువాత మాన్పించేశాం! నాన్న పనులు ఆయనే చేసుకోవటం అలవాటైపోయింది. ఆపరేషన్ జరిగిన ఏడాదికి ఆయన రాసిన "అమ్మకో ముద్దు" అనే నాటిక దాదాపు నలభై పరిషత్తు పోటీల్లో ప్రదర్శించబడి, ఉత్తమ రచయితగా ఎన్నో బహుమతులు గెల్చుకున్నారు.

డాక్టరు శివారెడ్డిగారు చెప్పినట్టు కేవలం నెల రోజుల్లోనే పూర్తిగా ఆరోగ్యవంతులై పోయారు నాన్న. ఇది నిజంగా 'మెడికల్ మిరకిల్ 'అని కేలో నాన్నని చూసిన డాక్టర్లందరూ

కూడా ఒప్పుకున్నారు. నాన్న మాత్రం అంతా ఆ శివుడి మాయ' అనుకుంటూ డా. శివారెడ్డిగారిని తలుచుకుంటారు ఇప్పటికీ.

చివరగా– కొసమెరుపు ఏమిటంటే– నాన్నకి ఆస్పత్రిలో చికిత్స పొందిన ఆ ఇరవై రోజులు మాత్రం అస్సలు గుర్తులేవు. ఆస్పత్రికి వెళ్లేముందు ప్రెస్ క్లబ్ లో స్పృహ తప్పటం తెలుసు .. ఇరవై రోజుల తర్వాత క్షేమంగా ఇంటికి రావటం తెలుసు.

మధ్యలో అంటే సెప్టెంబర్ 1 వ తేదీనుంచీ 20 వ తేదీవరకూ ఆయన జీవితపు క్యాలెండర్ లో రోజులు మాయమైపోయాయి.

"అంతా శివమాయ!"

నాన్నకి గుర్తులేని ఆ జ్ఞాపకాలు, మేం మాత్రం ఎప్పటికీ మర్చిపోలేం. మాకు మాత్రం అవి చేదు జ్ఞాపకాలుగానే మిగిలిపోయాయేమో అనిపిస్తుంది.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*